ప్రజాశక్తి

ఆదివారం 14 ఏప్రిల్ 2024 8 పేజీలు



గుంటూరు




పల్నాడు

లోకేష్ డబ్బు తీసుకుని వైసిపికి ఓటేయండి

- పేదలకు స్థలం ఇస్తానంటే అడ్డుకున్న చంద్రబాబును నిలదీయండి
- బీసీల సీటును బలవంతంగా లాక్కుంటున్నారు
- మంగళగిరి చేనేత సదస్సులో సిఎం జగన్ విమర్శలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



సిఎం జగన్‌కు చేనేత వస్త్రాలు బహూకరిస్తున్న వైసిపి మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.లావణ్య, ఎమ్మెల్సీ హనుమంతరావు

రాజధానిలో పేదలకు సెంటు స్థలం ఇస్తే ఓర్వలేని చంద్రబాబు నాయుడు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నాడని సిఎం జగన విమర్శించారు. పేదలకు ఏదో ఉద్ధరించానన్న చంద్రబాబు రాజధానిలో పేదలకు చేసిన మేలు ఎమిటో చెప్పాలన్నారు. మంగళగిరిలోని సికె కన్వెన్షన్ హాలులో శనివారం జరిగిన చేనేత కార్మికుల ముఖాముఖి సదస్సులోఆయన పాల్గొన్నారు. ఇంటిస్థలాలు ఇవ్వకుండా అడ్డుకున్న చంద్రబాబును ప్రజలు ఎన్నికల ప్రచారంలో నిలదీయాలన్నారు. చంద్రబాబుకు ఉన్న నెగిటివిటీ అనుభవం నాకు లేదన్నారు. ఎన్నికల్లో మన బతుకులు మార్చే నాయకుడిని ఎన్నుకోవాలని, 58 నెలలో తాను ఇచ్చిన సంక్షేమ పథకాలు టిడిపి హయాంలో ఎప్పుడైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఓటు వేసేటప్పుడు అప్రమత్తంగా లేకుంటే మళ్లీ మోసపోతామన్నారు. చేనేత కార్మికులకు అండగా ఉంటానన్న చంద్రబాబు మాటతప్పారని తాను అన్ని హామీలను అమలు చేశానన్నారు. రంగురంగుల మేనిఫెస్టోతో వస్తున్న చంద్రబాబు విషయం జాగ్రత్తగా ఉండాలన్నారు. పేదలకు మంచి జరిగితే అడ్డుకునే ▶ 2లో

అమరావతిని అంగుళం కదల్చలేరు

- రాజధానిలో గర్జించిన చంద్రబాబు
- తాడికొండ, ప్రత్తిపాడు సభల్లో పలు హామీలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి/తాడికొండ/ప్రత్తిపాడు



ప్రత్తిపాడు సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

అమరావతి రైతుల ఉద్యమం స్ఫూర్తిగా వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసిపి ఓటమికి నడుంబిగించాలని టిడిపి అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. సిఎం జగన్ మొండి వైఖరితో తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయం వల్ల రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం నియోజకవర్గ కేంద్రాలైన తాడికొండ, ప్రత్తిపాడులో జరిగిన ప్రజాగళం సభల్లో చంద్రబాబు మాట్లాడారు. ప్రత్తిపాడు సభలో మాజీ ఎమ్మెల్యే రావివెంకటరమణ చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. ఆయా సభల్లో చంద్రబాబు మాట్లాడుతూ సిఎం జగన్ చెప్పేది అబద్ధాలు, చేసేది మోసాలు అని ఘాటుగా విమర్శించారు. సిఎం జగన్ రాజధానిని విచ్ఛిన్నం చేయడంతో ఆయన మనుషులు రాజధానిలోని రోడ్లు తవ్వేసి మట్టి, ఇసుక కూడా దోచుకెళ్లిపోయారని దుయ్యబట్టారు. జగన్ పాలనకు తాను సున్నా మార్కులు వేస్తున్నానని చెప్పారు. గుంటూరు సిద్ధం సభ అట్టర్ ప్లాప్ అయిందన్నారు. తాను సేఫ్ డ్రైవర్‌నని రాష్ట్రాన్ని సురక్షితంగా నడిపిస్తానని వ్యాఖ్యానించారు. ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. ప్రజావేదికను కూల్చినప్పుడే ఈ ముఖ్యమంత్రి సైకో అని చెప్పా.. ప్రజలపై కక్ష్యను తీర్చుకోవడానికే జగన్ ముఖ్యమంత్రి అయ్యాడు.. రాష్ట్ర భవిత మార్చే నిర్మాణాలు ప్రారంభించి పరిపాలన తాను ▶ 2లో

నేడు తెనాలి రానున్న పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - తెనాలి

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం తెనాలి రానున్నట్లు ఆ పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక బోస్ రోడ్డులోని జనసేన కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రచారం నిమిత్తం పవన్ తెనాలి వస్తున్నట్లు చెప్పారు. హెలికాప్టర్లో సాయంత్రం నాలుగు గంటలకు సుల్తానాబాద్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారని అక్కడి నుంచి వారాహి వాహనంపై రోడ్‌షో ద్వారా మార్కెట్ కూడలిలోని సభావేదికైన అన్నాబత్తుని పుర వేదికకు చేరుకుంటారని అన్నారు. కూటమి గెలుపుతో తెనాలితో పాటు రాష్ట్రవ్యాప్తంగా చేపట్ట బోయే అభివృద్ధి కార్యక్రమాలను పవన్ వివరిస్తారన్నారు. సమావేశంలో నాయకులు బి.రవికాంత్, హెచ్.గౌరీశంకర్, టి.వెంకట రమణారావు పాల్గొన్నారు.


అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

వార్తలు మెయిన్ పేజీలో

ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థి ఆత్మహత్య

ప్రభుత్వ విద్యతోనే అసమానతలు దూరం

యుటిఎఫ్ స్వర్ణోత్సవం సందర్భంగా విద్యా సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు 8 లో



కేన్సర్ బారిన పడి ఆర్థిక దుస్థితిలో నాటక రచయిత

ప్రజాశక్తి - గుంటూరు

నాటక రంగంలో దాదాపుగా మూడున్నర దశాబ్దాల పాటు రచయితగా, నటుడిగా, దర్శకుడుగా ఒక వెలుగు వెలిగిన మునిపల్లె విద్యాధర్ కేన్సర్ బారిన పడ్డారు. 35 నాటకాలు రాసిన ఆయన పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డులు పొందారు. విద్యాధర రాసిన నాటకాలు ప్రదర్శించిన ప్రతి పరిషత్తులో బహుమతులు పొందాయి. వైద్యానికి అందని విధంగా తాను కేన్సర్‌కు గురయ్యానని, ఆర్థికంగా దుస్థితిలో ఉన్న తన కుటుంబాన్ని ఆదుకోవాలని విద్యాధర్ వేడుకుంటున్నారు. మిత్రులు మోదుగుల రవికృష్ణ, ప్రధానోపాధ్యాయులు పసుపులేటి శ్రీధర్ రూ.10 సాయాన్ని శనివారం అందించారు. సాయం చేసేవారు 8522990888 ఫోన్ నంబర్ ద్వారా ఫోన్‌పే లేదా గూగుల్ పే చేసి సహకరించాలని అభ్యర్థిస్తున్నారు.

నేడు షుగర్, బిపి వ్యాధులపై ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11 గంటలకు అరండల్‌పేట, 15/1 కుబేరా టవర్స్‌లోని అవగాహన కార్యాలయంలో షుగర్, బిపి, థైరాయిడ్ వ్యాధులపై ఆరోగ్య సభ నిర్వహిస్తున్నట్లు అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య సభలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కె. శంకర్ రెడ్డి ప్రధాన వక్తగా పాల్గొంటారని పేర్కొన్నారు.

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎక్సలెన్సీ పురస్కారం అందుకున్న శ్యామ్‌సాగర్

ప్రజాశక్తి-తెనాలి

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎక్సలెన్సీ పురస్కారాన్ని జర్నలిస్ట్ అంబటి శ్యామ్‌సాగర్ అందుకున్నారు. పట్టణానికి చెందిన టాలెంట్ ఎక్స్‌ప్రెస్, శ్రీశ్రీ మీడియా, టివి 7 న్యూస్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలందించిన వారికి పురస్కారం అందిస్తున్న నేపథ్యంలో పత్రికా రంగానికి సంబంధించి జర్నలిస్ట్ శ్యామ్‌సాగర్‌ను ఎంపిక చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని జైభీమ్ అంబేద్కర్ ఫెడరేషన్ కార్యాలయంలో శనివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంబేద్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అబ్రహాంలింకన్ అధ్యక్షతన నిర్వహించిన సభలో శ్యామ్‌సాగర్‌కు పురస్కారాన్ని అందించారు. షీల్డు బహూకరించి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అబ్రహాం లింకన్ మాట్లాడుతూ సమాజ చైతన్యంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమన్నారు. శ్యామ్‌సాగర్‌ను అంబేద్కర్ పురస్కారంతో సత్కరించటం అభినందనీమన్నారు. ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి యంద్రపాటి అశోక్‌కుమార్, ఎస్‌సిఆర్‌పిఎస్ ఆల్ ఇండియా సెక్రటరీ అందేశ్యామ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు జర్నలిస్టులు వారధి వంటివారని, వారిని ఇలాంటి అరుదైన పురస్కారాలతో సత్కరించుకోవటం ఎంతో సంతోషమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కె.రత్నాకర్, ఎం.శ్రీకాంత్, పి.పున్నయ్య, ఏఐటియూజీ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ గురుబ్రహ్మం, కె.డేవిడ్, బాబురావు పాల్గొన్నారు.



లోకేష్ డబ్బు తీసుకుని వైసిపికి ఓటేయండి

(మొదటి పేజీ తరువాయి)

వాడు రాజకీయ నాయకుడా? అని వ్యాఖ్యానించారు. మేనిఫెస్టోలో చెప్పే ప్రతీ హామీని నెరవేర్చిన వైసిపిని విమర్శించే నైతిక హక్కు చంద్రబాబుకు లేదన్నారు. బిసిల సీటును లాక్కునేందుకు చంద్రబాబు, లోకేష్ ద్వారా ప్రయత్నిస్తున్నారని, లోకేష్ ఓటుకు రూ.ఐదారే వేలు ఇస్తారని, ఆ డబ్బు ఇస్తే తీసుకుని ఓటుమాత్రం వైసిపికి వేయాలని అన్నారు. అంతకు ముందు జగన్ చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర 14వ రోజు నంబూరు బైపాస్ నుంచి ప్రారంభమైంది. ప్రజలు జననేత వైయస్ జగన్‌కు ఘనస్వాగతం పలికారు. దాదాపు వారంరోజులపాటు కొనసాగిన బస్సుయాత్ర శనివారం తాడేపల్లి వద్ద ముగిసింది. ఈ సందర్భంగా నంబూరు నుంచి తాడేపల్లి వరకు జరిగిన బస్సు యాత్రలో వైసిపి కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి రోశయ్య, మంగళగిరి అభ్యర్థి ఎం.లావణ్య పాల్గొన్నారు.

జగన్ బస్సు యాత్రకు వైఎస్ భారతి స్వాగతం



ప్రజాశక్తి-తాడేపల్లి: జగన్ యాత్రకు తాడేపల్లి బైపాస్ పెట్రోల్ బంకు జంక్షన్‌లో సిఎం జగన్ భార్య వైయస్ భారతి శనివారం సాయంత్రం సంఘీభావం తెలిపి స్వాగతం పలికారు. బస్సుయాత్రలో వస్తున్న ముఖ్యమంత్రికి భారతి అభివాదం చేయడంతో ప్రతిగా బస్సులో నుంచి సిఎం జగన్ అభివాదం చేశారు. బస్సుయాత్ర సందర్భంగా వారధి, బైపాస్ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

వైసిపిలోకి చందు, టివి రావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి : నంబూరు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న క్యాంపులో ఉన్న సిఎం జగన్ సమక్షంలో శనివారం జిల్లాకు చెందిన టిడిపి, బిజెపి, కాంగ్రెస్ పార్టీల నుంచి పలువురు నేతలు వైసిపిలో చేరారు. జనసేన రాష్ట్ర కన్వీనర్ వీరశెట్టి సుబ్బారావు, జిల్లా నాయకులు జియాఉర్ రహమాన్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు సాంబశివరావు, రాష్ట్ర కో-కన్వీనర్ డాక్టర్ టి.వి.రావు, టిడిపి నాయకులు బైరా అజయ్‌బాబు, నాగగౌడ్, మైనార్టీ నాయకులు షేక్ షాజిత్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు ఉస్మాన్ తదితరులు వైసిపిలో చేరారు. కార్యక్రమంలో మంత్రి విడదల రజని, ఎంపి ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తాఫా పాల్గొన్నారు.

అమరావతిని అంగుళం కదల్చలేరు

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభిస్తే ప్రజావేదికను కూల్చి విధ్వంసంతో పాలన ప్రారంభించిన వ్యక్తి జగన్ అని చంద్రబాబు దుయ్యబట్టారు. జూన్‌లో తాను సిఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మొదటిరోజే ప్రజావేదికను పునర్నిర్మిస్తానని, రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకొస్తానని చంద్రబాబు ఉద్ఘాటించారు. అమరావతి నిర్మాణం కొనసాగి ఉంటే రైతుల భూముల విలువ భారీగా పెరిగి ఉండేదని, వైసిపి రాగానే భూముల పడిపోయిందన్నారు. ప్రజలకు చేసిన మేలు ఏమీ లేకపోయినా జగన్ హయాంలో ఎంతో కీడు జరిగిందన్నారు. పన్నుల భారం విపరీతంగా ఉందన్నారు. జగన్ సామాజిక న్యాయం బూటకమన్నారు. జగన్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి పంచుకొని ఎస్‌సి, ఎస్‌టి, బిసిలను మోసం చేస్తున్నారని విమర్శించారు. అమరావతి, ప్రత్తిపాడుకు ఐటీ ఇండ్రస్టీస్ తెస్తామని, అమరావతి ప్రాంతంలో ఐటీ కారిడార్ నిర్మించే బాధ్యత తీసుకుంటామని అన్నారు. ప్రత్తిపాడులో దోపిడీ చేసిన మేకతోటి సుచరితను తాడికొండకు ట్రాన్స్‌ఫర్ చేశారని ఇక్కడ చెల్లని కాసు అక్కడ చెల్లుతుందా? అని ప్రశ్నించారు. రిటైర్డు కలెక్టర్ రామాంజనేయులను గెలిపించాలని కోరారు. వైసిపి ఎంపి అభ్యర్థి కిలారు రోశయ్య రోడ్లలో మట్టిని దొంగించే దొంగ అన్నారు. గ్రావెల్ దోపిడీతో రూ.వేలకోట్లు దోచుకున్నాడని ఆయనపై పెమ్మసాని చంద్రశేఖర్‌కు మామూలు గెలుపు కాదని వైసిపికి డిపాజిట్ కూడా రాదని అన్నారు.

గుంటూరు ఛానల్ విస్తరిస్తాం

గుంటూరు ఛానల్ పొడిగిస్తామని, నల్లమడ ముంపు నివారణ కోసం డ్రెయినేజీ నిర్మాణం చేపడుతామని, గుంటూరు రూరల్ మండలంలో విలీన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, వట్టిచెరుకూరు మండలం కుర్నూతల నుంచి పెందనందిపాడు వరకు మిగిలిపోయిన నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ చేపట్టి పూర్తిచేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అప్పాపురం ఛానల్ ద్వారా తాగునీరు ప్రాజెక్ట్ పునరుద్ధరించి పెదనందిపాడు, కొమ్మూరు, గార్లపాడు, కాకుమాను, కొండపాటూరు, పెద్దవారిపాలెం, అప్పాపురం గ్రామాలకు తాగు నీరిస్తామన్నారు. తాడికొండలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని చంద్రబాబు చెప్పారు. ఏడాది పూర్తయ్యేలోగా ప్రతి ఇంటికీ తాగునీరు ఇచ్చే బాధ్యత తనదన్నారు. ఇళ్లు, షాపులు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందిస్తామని, మల్లికార్జున స్వామి దేవాలయానికి ఘాట్ రోడ్డు నిర్మిస్తానని, దళితులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయిస్తామన్నారు. ఫిరంగిపురం కొండకు ఘాట్ రోడ్డు పనుల్ని పూర్తి చేస్తామని హామీనిచ్చారు.

చంద్రబాబును కలిసిన గల్లా దంపతులు

చంద్రబాబును గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గల్లా మాధవి, రామచంద్రరావు దంపతులు తాడికొండలో శనివారం సాయంత్రం కలిశారు. వారితోపాటు టిడిపి నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ ఉన్నారు.

టిడిపిని వీడి వైసిపిలో పలువురు చేరిక



ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పట్ల అభిమానంతో తాము టిడిపిని వీడి వైసిపిలో చేరుతున్నట్టు అబ్బినేనిగుంటపాలేనికి మాకినేని సదాశివరావు అన్నారు. సదాశివరావుతోపాటు మరో పది మందికి వైసిపి మండల కన్వీనర్ షేక్ ఖాసిం పీరా వైసిపి జెండాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సదాశివరావును అబ్బినేనిగుంటపాలెం వైసిపి గ్రామ అధ్యక్షులుగా నియమించినట్లు ఖాసింపీరా ప్రకటించారు. కార్యక్రమంలో ఏబీ పాలెం సొసైటీ చైర్మన్ కూరేటి భూషయ్య, నాయకులు ఎ.వెంకటేశ్వరరావు, సిహెచ్.సాంబశివరావు పాల్గొన్నారు.



గాయకుడు పురుషోత్తంప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి-గుంటూరు

ఏకధాటిగా 12 గంటలపాటు 129 పాటలు ఆలపించి, రికార్డు నెలకొల్పిన మేకల పురుషోత్తమ ప్రసాద్ గాయకులు అందరికీ స్ఫూర్తిదాయకం అని అవగాహన సంస్థ సాంస్కృతిక కార్యక్రమాల కో-ఆర్డినేటర్ బి.అశోక్ అన్నారు. శనివారం స్థానిక అవగాహన కార్యాలయంలో జరిగిన మనమూ పాడుదాం రండి కార్యక్రమంలో గాయకుడు మేకల పురుషోత్తమ ప్రసాద్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ప్రసాద్ చిన్నతనం నుండే కళారంగంపై ఉన్న ఆసక్తితో పాటలుపాడి ఆనందింప చేసేవారని, శుభాంజలి కళావేదిక స్థాపించి వందకుపైగా సంగీత విభావరులు నిర్వహించారని తెలిపారు. ఈ క్రమంలో 2023 నవంబర్ 19న గుంటూరు అన్నదానసత్రంలో 12 గంటలపాటు ఏకధాటిగా 129 ఘంటసాల పాటలు పాడి అందర్నీ ఆశ్చర్యపరిచారన్నారు. కళారంగంలో అద్భుతాలు సృష్టిస్తూ, ఉపాధ్యాయ వృత్తిలో సేవలు అందిస్తున్నారన్నారు. గాయకులు బి.సుబ్బారావు, థామస్ పాల్గొన్నారు.



సిఎఎపై మంగళగిరిలో నేడు సదస్సు

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి టిప్పర్ల బజారులోని ముస్లిం షాదీఖానాలో ఆదివారం జరిగే సిఎఎ సదస్సును జయప్రదం చేయాలని ఆవాజ్ నాయకులు కోరారు. నియోజకవర్గ పరిధిలోని ముస్లిం, మైనార్టీలు పెద్దఎత్తున పాల్గొనలన్నారు. ఆ మేరకు శనివారం తాడేపల్లి పట్టణంలోని మసీదులు, ముస్లిం పేటల్లో సిఎఎ కరపత్రాలను పంపిణీ చేశారు. అవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మోడీ పౌరసత్వ నినాదం అనే తేనె తుట్టును కదిలించారని, పౌరసత్వ చట్టం ముస్లిములకే కాకుండా హిందువులకు కూడా నష్టం కలిగిస్తుందని అన్నారు. ఫిరోజ్, డి.విజయబాబు, కె.బాబూరావు, వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

15, 16 తేదీల్లో పీవో, ఏపీవోలకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్నికల విధులు కేటాయించబడిన పీవోలు, ఏపీవోలకు ఈనెల 15, 16 తేదీల్లో ఏసీ కాలేజిలో తొలివిడత శిక్షణ ఇవ్వనున్నట్లు నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులకు పీవోల, ఏపీవోల హాజరు ఉదయం, మధ్యాహ్నం తప్పనిసరిగా తీసుకుంటామని, విధులు కేటాయించబడిన తేదీల్లో విధిగా శిక్షణకు హాజరు కావాలని స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ అధికారులు విద్యుత్, శిక్షణకు యల్.ఈ.డి టి.విలు తాగునీరు వంటి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. శానిటేషన్, బ్యానర్ల ఏర్పాటు బాధ్యత సంబంధిత శాఖలు చేపడతాయన్నారు.

నాగులపాడులో నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ : మండలంలోని నాగులపాడు శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం నాగులపాడు పుట్ట వద్ద పెదనందిపాడు శ్రీలౌక్య హెల్త్ కేర్ హాస్పిటల్ డాక్టర్ల పర్యవేక్షణలో సువర్ణ భారతీ మహోత్సవ సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివద్ధి కమిటీ చైర్మన్ గొల్లపూడి సాంబశివరావు తెలిపారు. పర్చూరు, పెదనందిపాడు మండల గ్రామాల ప్రజలు ఈ అవ కాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మద్యం అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - గురజాల

గురజాల సెబ్ స్టేషన్‌ను ఎపి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడ్మిన్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావు శనివారం తనిఖీ చేశారు. ఎన్నికల్లో భాగంగా, ఎన్నికల సమయంలో సెబ్ నేరాల అదుపునకు తీసుకోవాల్సిన జాగ్ర త్తలు, ఎలాంటి అసాంఘిక కార్య క్రమాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పై సెబ్ స్టేషం సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం పొందుగల సెబ్ చెక్ పోస్ట్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలో పాల్గొని వారికి తగు సూచనలు చేశారు. గురజాల సెబ్ స్టేషన్, పొందుగల సెబ్ చెక్ పోస్ట్‌లో నమోదు చేసిన కేసు ల వివరాలను పరి శీలించి తదుపరి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అదే విదంగా అక్రమ మద్యం నిల్వలు ఉన్న గోడౌన్లు, అక్రమ మద్యం సరఫరా, నాటుసారా తదితర నేరాలపై నిఘా పెట్టి వాటిని గుర్తించి కేసు నమోదు చేయాలన్నారు. చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలను నిర్వహించి, పొరుగు రాష్ట్రాల నుంచి ఎటువంటి మద్యం రవాణా జరగకుండా చూడాలన్నారు. ఏ రాజకీయ పార్టీలకు కొమ్ము కాయకుండా నిష్పక్షపాతంగా మద్యం అక్రమ నిల్వలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. శ్రీనివాసరావు వెంట ఎన్‌ఫోర్స్ మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటరమణ , సెబ్ చెక్ పోస్ట్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్ ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు.. చిత్రంలో నిందుతుడు కూడా ఉన్నాడు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అక్రమంగా మిలిటరీ మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని నరసరావుపేట రైల్వే పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. రైల్వే ఎస్ఐ జి.సుబ్బారావు తెలిపిన వివరాలు ప్రకారం శనివారం రైల్వే స్టేషన్ లో సాధారణ తనిఖీలు చేస్తున్న క్రమంలో 1 వ నెంబర్ ప్లాట్ ఫామ్ పై అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న వ్యక్తిని తమదైన శైలిలో విచారించగా 30 మద్యం సీసాలు తన వద్ద ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం రామాపురానికి చెందిన అన్నపురెడ్డి వెంక టేశ్వరరెడ్డి ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

మోడల్ స్కూల్ భవనం కేబుల్ వైర్లు చోరీ

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని వనికుంట గ్రామ సమీపంలో నిర్మాణం జరుగుతున్న మోడల్ స్కూల్ భవనం వద్ద ఏర్పాటు చేసిన మోటారు కేబుల్ వైరు,ప్యానల్ బాక్స్ ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు ప్రిన్సిపాల్ సునీల్ శనివారం తెలిపారు. నిధుల లేమి కారణంగా సుమారు నాలుగు నెలల క్రితం భవన నిర్మాణ పనులు నిలిపివేశారు. పనుల కొనసాగింపుకు నాడు నేడు నిధులు బ్యాంకు ఖాతాలలో జమ అవ్వటంతో పనులు ప్రారంభించేందుకు భవన నిర్మాణం జరిగే ప్రాంతానికి వెళ్లిన ఉపాధ్యాయులకు, పిఎంసి కమిటీ సభ్యులకు మోటారుకు ఏర్పాటుచేసిన 200 మీటర్ల కేబుల్ వైర్, ప్యానల్ బాక్స్ లేకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. చోరీ జరిగిన వస్తువుల విలువ సుమారు రూ. 22వేలు ఉంటుందని, స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.



నండూరులో కూటమి అభ్యర్థుల సమావేశంలో మాట్లాడుతున్న డి.నరేంద్రకుమార్

అధికారంలోకి వచ్చాక సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

నియోజకవర్గంలో అభివృద్ధి ఏమైనా జరిగిందంటే అది టిడిపి ప్రభుత్వ హయాంలోనేనని టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి డి.నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని నండూరులో టిడిపి, జనసేన, బిజెపి కూటమి కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబుతో కలిసి నరేంద్ర పాల్గొన్నారు. నండూరు, నుండి బోడిపాలెం వెళ్లే దారిలో ప్రధాన రహదారిపై వున్న, బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని, మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరారు. డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నరేంద్రకుమార్ మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన సమస్యలను తాము అధికారంలోకి వచ్చాక పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు టి.అప్పారావు, డి.సూర్య, వై.నాయుడు, ఎం.నాగరాజ్, నాగ మల్లేశ్వరరావు, గోపి పాల్గొన్నారు.

స్వర్ణ నాగరాజుకు ఉత్తమ జర్నలిస్టు అవార్డు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా





పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో మా చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వతంత్ర న్యూస్ ఛానల్ నరసరావుపేట రిపోర్టర్ స్వర్ణ నాగ రాజుకు సర్వజన మందిర్ సేవా సొసైటీ సంస్థ జిల్లా నుండి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీతగా ఎంపిక చేసింది. కొంత కాలంగా నరసరావుపేటలో వివిధ ప్రాంతాల్లో రాత్రి సమ యంలో వృద్ధులకు, యాచకులకు ఆహార పంపిణీ చేస్తూ ఆకలి తీర్చి వివిధ సేవా కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషిస్తూ సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తిగా పనిచేస్తున్న నాగరాజు సేవ లను గుర్తించిన సేవా సొసైటీ వ్యవస్థాపకులు లేగల సాయి ఈ వార్డుకు తనను ఎంపిక చేసినట్లు నాగరాజు తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ సర్వజన మందిర్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో 2024 ఉగాది పండుగ పురస్కరించుకొని ఉత్తమ జర్నలిస్ట్ అవార్డులను రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి ప్రజా సమస్యల పై సేకరణలో ఎప్పట ికప్పుడు ముందు ఉంటూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిల ఆయా నియోజకవర్గాలలో పనిచేస్తున్న ఎంపిక చేసిన 26 మంది జర్నలిస్టులను గుర్తించి సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21న విజయవాడలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు అందుకోనున్నట్లు చెప్పారు. తన సేవలకు గుర్తింపుగా అవార్డు లభించడం సేవా కార్యక్రమాల పట్ల మరింత బాధ్యత పెంచిందన్నారు. ఈ అవార్డును తన తల్లిదండ్రులు కీర్తిశేషులు స్వర్ణ రామకోటి, సామ్రాజ్యంలకు అంకితం చేస్తున్నట్లు నాగరాజు పేర్కొన్నారు.

కారంపూడిలో దళిత శంఖారావం

ప్రజాశక్తి - కారంపూడి



దళితులకు సముచిత స్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి. రామకష్ణారెడ్డికే దక్కుతుందని నియోజకవర్గ దళిత నాయకులు కొమ్ము. చంద్రశేఖర్, పాముల. సంపూర్ణ అన్నారు. శనివారం కారంపూడి మండలంలో దళిత శంఖారావం పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు హాజరవుతూ స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం నాడు మీడియాతో మాట్లాడారు. మాచర్ల నియోజకవర్గం లో దళిత జాతికి మాచర్ల మున్సిపల్ చైర్మన్ గా, రెంటచింతల ఎంపీపీ గా, దుర్గి మార్కెట్ యార్డ్ చైర్మన్ గా పదవులను తమ జాతికే కేటాయించారని అన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో 40 మంది ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఉన్నత పదవులు లభించాయని, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో దళితులకు సముచిత స్థానం కల్పించి, వారికి అండగా నిలిచారని అన్నారు. రామకష్ణారెడ్డి కోట్ల రూపాయలతో అసంపూర్తిగా వున్న పలు చర్చిలను సంపూర్తిగా నిర్మించటం జరిగిందని, వైస్సార్సీపీ ప్రభుత్వంలో చర్చి లు నిర్మాణం చేసుకోవడం జరిగిందని వారు అన్నారు. ముఖ్యంగా దళితులకు సమచిత స్థానం కల్పించి నామినేటెడ్ పదవులు సైతం దళితులకు కేటాయించేలా జగన్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని వారు అన్నారు. దళిత శంఖారావం పేరుతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో దళితులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, దళితులకు జగన్ ప్రభుత్వం చేసిన పనులను వివరిస్తూ ఈ కార్యక్రమాన్ని రూపొందిచినట్లు చెప్పారు. ఇప్పటికే మాచర్ల, వెల్దుర్తి మండలాల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తిచేసుకుని శనివారం కారంపూడి మండలంలో పర్యటించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కారంపూడి ఎంపీపీ బొమ్మిన. సావిత్రి అల్లయ్య, పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్. అక్బర్, సర్పంచ్ ప్రమీలాబాయ్ తేజానాయక్, కో ఆప్షన్ సభ్యులు అంతరగడ్డ. ఏసోబు, బంకూరు. నాగేశ్వరరావు, జాన్‌పాల్,చింతపల్లి ఎంపిటిసి అచ్యుతరావు, వెంకట్రావు, కాలే. రాంబాబు పాల్గొన్నారు.



సంక్షేమ వైసిపికి పట్టం కట్టాలి

ఎన్నికల ప్రచారంలో డాక్టర్ సుస్మిత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా భావించి పాలన సాగిస్తున్న సంక్షేమ వైసిపికి మళ్ళీ పట్టం కట్టాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఆశీస్సులు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి భార్య డాక్టర్ సుస్మిత కోరారు. మండలంలోని లింగంగుంట్లలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి నవరత్నాల పేరిట వైసిపి అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్దిని వివరించారు. ఈ సందర్భంగా సుస్మిత మాట్లాడుతూ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి పార్లమెంట్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని అత్యధిక మెజార్టీ తో గెలిపించాలని కోరారు. మరోసారి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని విధాలుగా అభివద్ధి చెందుతుందన్నారు. టిడిపి అబద్దాలు చెప్పడం తప్ప అభివద్ధి చేయరన్నారని హామీలు ఇచ్చినా వాటిని అమలు చేసేది లేదన్నారు. బాబు వస్తే జాబ్ వస్తుందని, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని గతంలో చెప్పారని అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి గురించి చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. మంచి చేసిన వైసిపి ప్రభుత్వాన్ని గుర్తించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పొన్నపాటి విజయ్ కష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ పూనూరి కోటిరెడ్డి అధిక సంఖ్యలో వైసిపి నాయకులు మహిళలు పాల్గొన్నారు.

దుర్గిలో పోలీసుల కవాతు

ప్రజాశక్తి-దుర్గి

దుర్గి లో శనివారం కేంద్ర బలగాలతో కారంపొడి సిఐ.. చిన్న మల్లయ్య ఆధ్వర్యంలో... ప్రధాన రహదారితో పాటు..గ్రామంలోని పలు వీధుల్లో నిర్వహించారు ఈ సందర్భంగా సిఐ చిన్న మల్లయ్య మాట్లాడుతూ వాహనాల మీద ఎటువంటిపార్టీలకు చెందిన స్టిక్కర్లు పెట్టుకోరాదని, అదేవిధంగా అధికంగా ప్రజల ఓట్లను ప్రభావించే నగదు ఇతర వస్తువులను చేరవేస్తే కేసులు నమోదు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై కోటయ్య కేంద్ర బలగాలు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - మేడికొండూరు



గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని సిరిపురం రోడ్‌లో శనివారం రాత్రి జరిగింది. సిరిపురానికి చెందిన ముప్పాళ్ళ హరికృష్ణ ద్విచక్ర వాహనంపై సిరిపురం వస్తుండగా మార్గ మధ్యంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. రోడ్డుపై పడిపోయిన హరికృష్ణకు తీవ్ర గాయాలై, రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో గురుకుల విద్యాలయ విద్యార్థులు సత్తా చాటారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయ సీనియర్ జూనియర్ ఇంటర్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. సీనియర్ ఇంటర్ లో 70మంది విద్యార్థులకు గాను 60 మంది ఉత్తీర్ణత సాధించారు. ముగ్గురు విద్యార్థులకు 922 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ లో 73మంది విద్యార్థులకు గాను 59 మంది ఉత్తీర్ణులయ్యారు. జూనియర్ ఇంటర్ విద్యార్థి 422 మార్కులు సాధించినట్లు తెలిపారు.

ఇంటర్ ఫలితాలలో తగ్గిన ఉత్తీర్ణత శాతం

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరు ఎపి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 33 మంది హాజరవగా 17 మంది ఉత్తీర్ణత సాధించగా 51 శాతం నమోదైంది. ద్వితీయ సంవత్సర పరీక్షలకు 45 మంది హాజరవ్వగా 17 మంది ఉత్తీర్ణత సాధించగా 38 శాతం నమోదైనట్లు ప్రిన్సి పాల్ సునీల్ తెలిపారు. అలాగే,కేజీబీవీ పాఠశాలలో ఎంఇసి గ్రూపులో ప్రథమ సంవత్సరంలో ఐదుగురు బాలికలకు గాను ఐదుగురు ఫెయిలయ్యారు. అలాగే, ద్వితీయ సంవత్సరంలో 19 మంది బాలికలకు గాను 8 మంది ఉత్తీ ర్ణత సాధించగా 11 మంది ఫెయిల్ అవ్వడంతో 42 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ప్రగతి జూనియర్, బృందా మహిళా జూనియర్ కాలేజీల విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి-సత్తెనపల్లి



కె.సౌమ్యశ్రీ పి.అభిలాష్

ఇంటర్ పరీక్ష ఫలితాలలో పట్టణం లోని ప్రగతి జూనియర్ కాలేజీ విద్యార్థి పి.అభిలాష్ సిఇసి విభాగంలో 1000 మార్కులకు గాను 949 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ లో నిలిచారని, కళాశాలలో 80 శాతం ఉత్తీర్ణత సాధిం చారని, బృంద మహిళ జూనియర్ కాలేజీ విద్యార్థిని కె.సౌమ్యశ్రీ బాయి 500 మార్కులకు గాను 442 మార్కులు సాధించి కాలేజీ ఫస్ట్ స్థానంలో నిలిచారని కళాశాలలో 84 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఆయా కళాశాలలో డైరెక్టర్లు పరిటాల నరేష్, గంగారపు అనూష శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యారినీ విద్యార్థులను వారు అభినందించారు.



కాంగ్రెస్‌తోనే మహిళా మహాలక్ష్మి కాగలదు

ప్రజాశక్తి -దుర్గి

గత రాత్రి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి రామ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో దుర్గిలోని పలు వార్డులలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ 9 గారెంటీలను ప్రచారం చేశారు. ముఖ్యంగా ప్రతి కుటుంబంలో ఒక మహిళ పేరుమీద ప్రతినెలా రూ.8, 333.. సంవత్సరానికి లక్ష రూపాయలు ఇవ్వగలిగే మహిళా మహాలక్ష్మి పథకం గురించి వివరించారు. అభివృద్ధి, సంక్షేమం సమానంగా అందరికీ చేరవేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు చిమట వెంకటేశ్వర్లు, గాదె పుల్లారెడ్డి, వంగపాటి నాగరాజు, కొమ్ము కోటేశ్వరరావు,రాగిడి ప్రతాప్ బాబు,నాయకులు పెరపాటి రమేష్, దిబ్బయ్య, నాజర్వలి, కందుకూరు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు

పోరాటాలపై వక్రీకరణలను తిప్పికొట్టాలి

తుమ్మలపాలెం అమరవీరుల స్మారక సభలో కమ్యూనిస్టు పార్టీలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నైజం నవాబులు పాలనలో ఉన్నది ఒక్క ముస్లింలే కాదని, అనేక రకాల వాళ్ళు ఉన్నారని, భూమి కోసం, భుక్తి కోసం నైజాం నిరంకుశ పాలనపై పెద్ద ఎత్తున దేశ చరిత్రలో నిలిచిపోయేలా జరిగిన పోరాటాలకు కులం, మతం లేదని, అలాంటి ఉద్యమ పార్టీలకు కులాలను ఆపాదించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. యడ్ల పాడు మండలం తుమ్మల పాలెంలోని అమర్‌నగర్‌లో శనివారం తుమ్మల పాలెం అమరవీరుల స్మారక సభ జరిగింది. ముఖ్య అతి థిగా పాల్గొన్న విజయకుమార్ మాట్లాడుతూ నైజాం నవాబులకు వ్యతి రేకంగా తెలంగాణ సాయుధ పోరాటాలు పెద్ద ఎత్తున అనేక గ్రామాల్లో జరిగాయని, ఆ పోరాటంలో అనేక మంది ప్రాణాలు కోల్పో యారని చెప్పారు. అటువంటి అమ రులను ప్రతి సంవత్సరం గుర్తుచేసుకోవ డం శుభపరిణామం ఉన్నారు. కమ్యూనిస్టు పోరాడి నేలకొరిగిన ఈ 27 మంది వీరుల బలిదానం ఎందుకు అనే విషయాన్ని కనీసం ఈ ప్రాంత ప్రజలకు, యు వతకు గుర్తుచేసేందుకే ప్రతి సంవత్సరం ఈ స్మారక సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాడు నవాబులను, పెత్తందార్లను వ్యతిరేకించే క్రమంలోనే గెరిల్లా దళాలు ఏర్పడ్డాయని, ఆ ఉద్యమాలలో కులాలు లేవు,మతాలు లేవని కేవలం కష్టజీవుల భుక్తి కోసం, విముక్తి కోసమే ఆ ఉద్యమాలు జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. అలాంటి ఉద్యమాలకు నేడు కులాన్ని ఆపాదించే చర్యలు చేస్తున్నారని, వాటిని కలసికట్టుగా తిప్పి కొట్టాలని కోరారు. కమ్యూనిస్టులను అగ్రవర్ణాల పార్టీ గా చిత్రీకరించి జనంలోకి తీసుకెళ్లే ప్రయ త్నాలు నేడు అనేక పార్టీల వాళ్ళు చేస్తు న్నారని, వీటిని తిప్పికొట్టాలని అన్నారు. గత రాజకీయాలకు నేటి రాజకీయాలు చాలా వ్యత్యాసం ఉందని, కేవలం డబ్బు ఉంటేనే వారిని నాయకులుగా ఎన్నుకునే పరిస్థితి ప్రస్తుతం ఉందని చెప్పారు. రాజకీయం కేవలం డబ్బు మీద నడవదన్న విషయాన్ని తెలియ చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ ప్రస్తుత కమ్యూనిస్టులు ఉద్యమాలు నీరసించి పోతున్నాయని, ఇప్పటికైనా అందరం కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నా యకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యమాల్లోనే కాకుండా ఎన్నికల్లో కూడా కమ్యూనిస్టులు అందరూ కలసికట్టుగా పోటీ చేయాల్సిన అవసరం వచ్చిందన్నారు. పార్లమెంటులోనూ అసెంబ్లీ లోనూ కమ్యూనిస్టుల గొంతుకలను వినిపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కలిసికట్టుగా ఉద్యమాల్లో పాల్గొన్నట్లే ఈ ఎన్నికల్లో పాల్గొని ఎక్కువ మందిని అసెంబ్లీకి పార్లమెంటుకు పంపించాలన్నారు. సిపిఎంఎల్ రాష్ట్ర నాయకులు మన్నవ హరి ప్రసాద్ మాట్లాడుతూ కమ్యూనిస్టులు నిస్వా ర్థంగా ప్రజల కోసమే అనేక త్యాగాలు చేశారని అందుకు ఉదాహరణ ఈ తుమ్మలపాలెం స్మారక సభ అని అన్నారు. కలసికట్టుగా మన అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి నరసింహారావు అధ్యక్షులుగా వ్యవహరించారు. మొదట ఆయా పార్టీల జెండాలను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పిం చారు.



అమరవీరుల స్తూపాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, అభిమానులు తదితరులు



అమరవీరుల స్మారక సభలో మాట్లాడుతున్న గుంటూరు విజయకుమార్

ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తెలంగాణ రాష్ట్రానికి చెందిన రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ రంగంలో గుర్తింపు పొందిన దిగ్గజ ఎస్ఎల్ఎన్ బిల్డ్ కాన్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు తమ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 5 గురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. నరసరావుపేట మండలం లోని కేసానుపల్లి గ్రామ పరిధిలోని తమ కళాశాలలో ముందుగా హెచ్ఆర్ మేనేజర్ విజయ్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కంపెనీ విధి విధానాలు వివరించారు. ప్రాంగణ ఎంపికల్లో 21 మంది బిటెక్ 4 వ ఏడాది సివిల్ విద్యార్థులు ఈ ఎంపికల్లో పాల్గొనగా కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు రాత పరీక్ష, బృంద చర్చలు, ముఖాముఖి ఇంటర్వ్యూలలో 5 గురు విద్యార్థులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు కంపెనీ శిక్షణా కాలంలో వార్షిక వేతనం రూ.2 లక్షలు చెల్లించనున్నట్లు, ఈ నెలలోనే విధులలో చేరనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది తమ కళాశాల విద్యార్థులకు 100 శాతం ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ప్రణాళికలు రూపొందిం చామన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అభి నందన సభలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, కళాశాల సెక్రటరీ , కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు, కళాశాల ప్లేస్ మెంట్ ఆఫీసర్ షేక్ముజీర్ అభినందించారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ తదితరులు

40 ఏళ్లు నిండితే కంటి పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డి

40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎం.విరెడ్డి నేత్ర వైద్యశాల అధినేత డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డి అన్నారు. శనివారం ప్రజాశక్తితో డాక్టర్ వివేకానందరెడ్డి ప్రత్యేకంగా మాట్లాడుతూ సాధారణంగా 40 ఏళ్ల వయసులో ఉన్న వారికి కంటి చూపు మంద గిస్తుందని, పొడిబారిన కళ్ళు, శుక్లం, గ్లకోమా, మధుమేహ రెటినోపతి, వయో సంబంధిత మాక్యులర్ క్షీణత వంటి కొన్ని కంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. దృష్టి హాని, పార్శ్వదృష్టి లోపం, దృష్టిలో హెచ్చు తగ్గులు, ఫ్లోటర్లు, వక్రంగా చిత్రాలు చూడటం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా మధుమేహం, అధిక రక్త పోటు ఉన్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. స్త్రీలకు మెనోపాజ్ సమయంలో హార్మోనులలో మార్పులు కూడా కంటి సమస్యలు ప్రేరేపించవచ్చన్నారు. 40 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఏడాది ఒకసారైనా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని కోట సెంటర్ లోని (ఎంవి రెడ్డి ఐ) తమ హాస్పిటల్ లో అన్ని రకాల కంటి వ్యాధులకు సమగ్ర రోగ నిర్ధారణ, వైద్య, శస్త్రచికిత్స సేవలను అందిస్తున్నామని, ఆరోగ్య శ్రీ సౌకర్యం ఉందన్నారు.

నాయకుల వ్యక్తిగత ప్రయోజనాలు... పార్టీల తాయిలాలు

- ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీలు మారుతున్న నాయకులు
- కొత్తవారిని ఆకర్షించే పనిలో పార్టీలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సమయంలో తమకు వ్యక్తిగతంగా ఒనగూరే ప్రయోజనాలను బేరీజు వేసుకుంటూ నాయకులు ఒక పార్టీ నుండి మరో పార్టీకి దూకుతున్నారు. కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, పంచాయతీల్లోనూ చోటామోటా నాయకులు మొదలు ఒక స్థాయి ఉన్న నేతల వరకూ ప్రస్తుతం ఈ లెక్కల్లోనే ఉన్నారు. మరోవైపు పార్టీలు కూడా ఎవరు వస్తే వారిని చేర్చుకోవడంతో పాటు కొత్తవారిని లాక్కోవడానికీ నానా రకాల తాయిలాలతో సిద్ధంగా ఉన్నాయి. మున్సిపల్ కౌన్సిలర్లను ఆకర్షించే ప్రయత్నాలను ప్రత్యర్థి పార్టీ ముమ్మరంగా చేస్తోంది. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్తగా గతంలో నియమితులైన మల్లెల రాజేష్ నాయుడును మార్చడంతో ఆయన టిడిపిలో చేరడం ఈ చేరికల్లో పరాకాష్టగా చెప్పవచ్చు.ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఏ చిన్న అవకాశాన్నీ వదులుకోవడం లేదు.

అధికార వైసిపిలో నియోజకవర్గ సమన్వయకర్త మార్పుతో ఆ పార్టీ కౌన్సిలర్లలో గందర గోళం ఏర్పడింది. మున్సిపాల్టీలో 38 కౌన్సిలర్లు, ముగ్గురు కో-ఆప్షన్ సభ్యులు కలిపి 41 మంది ఉండగా వీరిలో 8 మంది టిడిపి తరుపున గెలిచిన వారు. ఆరుగురు వైసిపి కౌన్సిలర్లు ఇటీవలే టిడిపిలో చేరారు. కౌన్సిల్‌లో మెజార్టీ సాధించాలంటే 22 మంది అవసరం. టిడిపికి ఫిరాయింపుదారులతో కలిసి 14 మంది ఉన్నారు.

మరో 8 మంది అధికారికంగా టిడిపిలో చేరకున్నా మద్దతు మాత్రం ఇస్తామని చెప్పినట్లు సమాచారం. అయితే ఏ పార్టీ ఎలా వ్యవహరిస్తుందనేది ఆసక్తిగా మారింది.




తాడేపల్లిలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో అంబేద్కర్‌కు, జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు, నిడమర్రులో కాంగ్రెస్ నాయకులతో శివశంకరరావు తదితరులు

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే 'ఇండియా' అభ్యర్థులను గెలిపించాలి

- సిపిఎం మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్న శివశంకరరావు
- కాంగ్రెస్, ఇతర నాయకులను కలిసి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - మంగళగిరి

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 'ఇండియా' వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాలని నాయకులు ఉద్ఘాటించారు. ఇండియా వేదిక తరుపున మంగళగిరి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు శనివారం కాంగ్రెస్ పట్టణ కార్యాలయానికి వెళ్లి ఆ పార్టీ నాయకులను కలిశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కె.జీవన్ సాగర్ మాట్లాడుతూ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన బిజెపితో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు చేతులు కలిపాయని విమర్శించారు. వైసిపికి, టిడిపికి ఓటు వేస్తే బిజెపికి వేసినట్లేనని అన్నారు. రాష్ట్ర, దేశ ప్రయోజనాలు దష్ట్యా రానున్న ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులుగా పోటీ చేస్తున్న సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. జొన్న శివశంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్పొరేషన్లో పన్నులు అధికంగా వేశారని విమర్శించారు. 20 వేల మంది వివిధ రకాల భూముల్లో పేదలు ఇల్లు వేసుకుని నివసిస్తున్న వారికి అక్కడే నివాస ఉంటున్న వారికి ఇంటి పట్టాలు రావాలంటే ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని బిజెపి ధ్వంసం చేస్తోందని, బిజెపి నుండి రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. జొన్న శివశంకరరావుతోపాటు గుంటూరు ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్, గుంటూరు జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, సిపిఐ నియోజవర్గ కార్యదర్శి చిన్నితిరపతయ్య, నాయకులు జె.జానుబాబు, వై.వెంకటేశ్వరరావు, కె.కాశయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు జి.సాంబశివరావు, కె.రాధిక, ఇ.శివాజీ, బి.సమర్పణ కుమార్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి కె.రామారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నిడమర్రులో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుర్రా పున్నారావును జొన్న శివశంకర్‌రావు, సిపిఎం నాయకులు శనివారం కలిశారు. మంగళగిరి ఎమ్మెల్యేగా ఇండియా బ్లాక్ అభ్యర్థి శివశంకర్‌రావు గెలుపునకు కృషి చేస్తామని ఈ సందర్భంగా పున్నారావు చెప్పారు. గ్రామంలో ఇతర పెద్దలను కలిసి ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలని శివశంకరరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రతిష్టను దిగజారుస్తున్న బిజెపిని, దాని మిత్రులను ఓడించాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు వలన అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బిజెపి కూటమి అబద్ధాలు, అవకాశవాద రాజకీయాలతో పబ్బం గడుపుకునేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. భారత రాజ్యాంగానికి బిజెపి తూట్లు పొడుస్తోందని, మనువాద రాజ్యాంగ అమలుకు యత్నిస్తోందని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రజలపై భారాలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమే కారణమన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీ చట్టాలు అమలు చేయకుండా, రాజధానికి ఒక రూపాయి కూడా ఇవ్వకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బిజెపికి, తగిన గుణపాఠం చెప్పే అవకాశం ప్రజలకు ఇప్పుడు ఎన్నికల ద్వారా వచ్చిందని అన్నారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు నోరు మెదిపేందుకు భయపడుతున్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో వామపక్షాలు, కాంగ్రెస్ ఇతర లౌకిక పార్టీలకు ఓట్లేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, నాయకులు ఎం.భాగ్యరాజు, కె.వెంకటేశ్వర్లు, జి.నాగేశ్వరరావు, ఎం.ప్రసన్నకుమార్, కె.నాగేశ్వరరావు కె.నానయ్య, సురేష్, ఎం.రాజముని, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

రాజ్యాంగ వ్యవస్థలు పరిరక్షింపబడాలంటే ఇండియా వేదిక అభ్యర్థులకే ఓట్లు వేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య ప్రజలను కోరారు. స్థానిక మేకా అమరారెడ్డి భవన్‌లో నిర్వహించిన సిపిఎం విస్తృత సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇండియా వేదిక నుండి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు, గుంటూరు ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిపిఐ జంగాల అజయ్‌కుమార్‌లకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన పది సంవత్సరాల కాలంలో సిబిఐ, ఈడి లాంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థలను నీరు గార్చారని అన్నారు. తన రాజకీయ స్వార్థం కోసం ప్రతిపక్ష పార్టీల నేతలను అక్రమంగా అరెస్టు చేయించి జైలుకు పంపిస్తున్నారని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని హెచ్చరించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మోడీ దగ్గర దాసోహం అయ్యాయని ఎద్దేవా చేశారు. ఆ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాసకుమారి, వి.దుర్గారావు పాల్గొన్నారు. శనివారం రాత్రి సుందరయ్యనగర్‌లో జరిగిన జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. సిపిఎం నాయకులు కె.కరుణాకరరావు మాట్లాడారు. ఎస్‌కె బాష, కొండబాబు పాల్గొన్నారు.

వైసిపికి పారేపల్లి మహేష్ రాజీనామా

ప్రజాశక్తి - మంగళగిరి

గుంటూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, మంగళగిరి పట్టణంలో వైసిపి పార్టీలో ప్రముఖులు పారేపల్లి మహేష్ శనివారం సాయంత్రం వైసిపికి రాజీనామా చేసినట్లుగా విలేకరులకు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బస్సు యాత్ర సందర్భంగా వినతి పత్రానికి ఇవ్వడానికి వెళ్లగా పట్టించుకోలేదని, పార్టీలో గుర్తింపు లేకుండా పోయినందువల్ల రాజీనామా చేసినట్లు చెప్పారు.

ఉన్నట్టుండి వర్షం... గ్రామాల్లో అంధకారం...

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

వేసవి తాపంతో ఉక్కిరి బిక్కిరవుతున్న ప్రజలకు శనివారం మధ్యాహ్నం నుండి కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడి కాస్తంత ఉపశమనం దక్కినట్లయింది. మరోవైపు ఈదరు గాలులు, గంటపాటు ఏకధాటిగా కురిసిన వానకు విద్యుత్త అంతరాయం ఏర్పడి మండలంలోని పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది. ఇళ్లలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. వడ్డేశ్వరం, కొలనుకొండ, మెల్లెంపూడి, గుండిమెడ, చిర్రావూరు తదితర గ్రామాలలో సాయంత్రం నాలుగు గంటలకు విద్యుత్ సరఫరా నిలిచి 8.30 గంటల వరకూ రాలేదు. అనంతరం విద్యుత్ సిబ్బంది ఒక్కో గ్రామాన్ని క్రమంగా పునరుద్ధరిస్తూ వచ్చారు.

అధికారంలోకి వస్తే మున్సిపాల్టీగా మంగళగిరి : లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిని తిరిగి మున్సిపాలిటీ చేస్తామని, పన్నుల భారం తగ్గిస్తామని టిడిపి మంగళగిరి నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి నారా లోకేష్ అన్నారు. శనివారం రాత్రి మంగళగిరి పట్టణంలోని కొత్తపేట, 13వ వార్డు ఇస్లంపేటలో రచ్చబండ కార్యక్రమం జరిగింది. లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంగళగిరి – తాడేపల్లి నగరపాల సంస్థ పరిధిలో పనులు అధికంగా ఉన్నాయని అన్నారు. ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి పాలనలో మంగళగిరిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. అభివృద్ధికి నిధులు కూడా కేటాయించలేదని అధికార పార్టీ ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసినప్పుడు చెప్పారని గుర్తు చేశారు. మంగళగిరిలో తన గెలిపిస్తే తిరిగి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని


రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న లోకేష్

హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందం అబద్దయ్య, దామర్ల రాజు, పోతినేని శ్రీనివాసరావు, షేక్ రియాజ్, ఎమ్‌డి ఇబ్రహీం, జనసేన పార్టీ నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, మునగపాటి వెంకట మారుతీరావు, షేక్ సుభాని పాల్గొన్నారు.


కంఠంరజు కొండూరులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

రాజ్యాంగ పరిరక్షణ - లౌకిక పరిరక్షణపై నేడు ఆవాజ్ సదస్సు

ప్రజాశక్తి - దుగ్గిరాల

రాజ్యాంగ పరిరక్షణ, లౌకిక పరిరక్షణ అంశంపై ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మంగళగిరిలోని అంజుమన్ షాది ఖానాలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని మండలంలోని కంఠంరాజు కొండూరులో శనివారం కరపత్రాలు పంపిణీ చేశారు. పదేళ్ల నుండి బిజెపి అనుసరిస్తున్న లౌకికవాద వ్యతిరేక విధానాలపై ఈ సదస్సులో చర్చించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జె.బాలరాజుర, ఎస్.సుభాని, ఇమ్రాన్, కరీముల్లా, బాజీ పాల్గొన్నారు.



పొన్నూరులో పోలీసు కవాతు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పొన్నూరు పట్టణంలో పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుండి నేతాజీ నగర్, జిబిసి రోడ్, రైల్వే స్టేషన్ రోడ్డు, రైతు బజార్ మీదుగా కవాతు సాగింది. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక పోలీసు బలగాలు అందుబాటులోకి వచ్చినట్లు అర్బన్ సిఐ పి.భాస్కర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని, వివాదాలకు దూరంగా ఉండాలని కోరారు.

ఇంటర్ ఫలితాల్లో మాజేటి గురవయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుంటూరు

ఇంటర్ ఫలితాల్లో శ్రీ మాజేటి గురవయ్య జూనియర్ కళాశాల విద్యార్థులు 83 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల సెక్రెటరీ - కరస్పాండెంట్ మాజేటి వెంకట రామకోటి ముత్యాలు శనివారం తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవపెద్ది విజయలక్ష్మి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల కళాశాల చరిత్రలో ఇంటర్మీడియట్ విద్యార్థులు వేలాదిమంది ఉన్నత విద్యలు అభ్యసించి రంగాల్లో స్థిరపడ్డారని చెప్పారు. సీనియర్ ఇంటర్ విద్యార్థి ఎ.నిరంజన్‌రెడ్డి ఎంపీసీ 1000/863 మార్కులు, జూనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి పి.నాగ వరుణ్ సాయి 470/362 మార్కులు సాధించారని చెప్పారు. ఇంగ్లీషులో 93 శాతం, సివిక్స్‌లో 75 శాతం, ఎకనామిక్స్‌లో 82 శాతం, కామర్స్‌లో 87, కెమిస్ట్రీలో నూరు శాతం ఫలితాలు సాధించారని విద్యార్థులను, అందుకు సహకరించిన అధ్యాపకులను అభినందించారు.





ఇంటర్ ఫలితాల్లో వివేకానంద విజయభేరి

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఇంటర్ ఫలితాల్లో శ్రీ వివేకానంద విద్యాసంస్థల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శిరీష తెలిపారు. ఎంపీసీలో కోమలి 981 మార్కులతో మండలంలోని ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. రిపిక 961, టి.వెంకటేశ్వరరావు 949, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఘట్టమనేని తేజ 459 మార్కులతో ప్రథమ స్థానం, దూళ్ళ మణికంఠ 453, సి.హెచ్. అశోక్ -451, కె.దేవి శ్రీ 451, హరిహరన్ 450, ఎం.సాయితేజ 450 మార్కులు సాధించారని వివరించారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు శ్రీ వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ దుర్గాప్రసాద్, ఇన్‌ఛార్జి వీరబాబు, అధ్యాపకులు అభినందించారు.

గీతమ్స్ మహిళా కళాశాల విద్యార్థినుల సంచలనం

ప్రజాశక్తి - వినుకొండ



ఇంటర్మీడియట్ ఫలితాలలో గీతమ్స్ మహిళా కళాశాల విద్యార్థులు సంచలనం సృష్టించారు. సీనియర్ ఇంటర్ ఫలితాలలో ఎంపిసి విభాగంలో కంచర్ల కావ్య 1000 మార్కు లకు గాను 974 మార్కులు సాధించగా జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో జి.సుస్మిత 456 మార్కులు, టి. కుసుమాంజలి 453 మార్కులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం 45 మంది గ్రామీణ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలతో సాధించిన అసాధారణ ఫలితాలే ఇందుకు నిదర్శనం అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుండి ఎంసెట్, జేఈఈ మెయిన్స్, నీట్ లలో అత్యుత్తమ ర్యాంకులే లక్ష్యంగా విద్యాబోధన ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినిలను కళాశాల ప్రిన్సిపల్, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

మాలలకు మేలు చేసింది టిడిపి ప్రభుత్వమే : కన్నా

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



మాలలకు మేలు చేసింది టిడిపి హయాంలోనే నని టిడిపి-జనసేన-బిజెపి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీ నారాయణ అన్నారు. సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ ప్రజా వేదిక లో మాలల నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమావేశం నిర్వ హించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఐదు ఏళ్ళ జగన్ పాల నలో దళితులకు ఒరిగింది ఏమి లేదన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గొల్ల అరుణకుమార్ దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు, గుంటూరు ఆశీర్వాదం,ఏకుల రాజశేఖర్,దారా ముసలయ్య మస్తాన్ రావు పాల్గొన్నారు.

వరికపూడిసెలను పూర్తి చేసి ప్రజలకు అంకిత మిస్తాం

ప్రజాశక్తి-వెల్దుర్తి

వరికపూడిసెల ప్రాజెక్ట్ ను పూర్తి చేసి మాచర్ల ప్రజలకి అంకితం చేస్తామని నరసరావుపేట ఎంపి అభ్యర్థి లావు శ్రీ కృష్ణదేవరాయాలు అన్నారు. వెల్దుర్తి మండలం సిరిగిరిపాడు లో మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి తో కలసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణ దేవ రాయలు మాట్లాడుతూ పల్నాడులో సాగు,తాగునీటి సమస్యలు లేకుండా చేసేందుకు కృషి చేస్తానన్నారు. మాచర్ల నియోజకవర్గం గడ్డ కొత్త నాయకుడితో సుపరిపాలన కోరుకుంటోందని అన్నారు.

తాగునీటి చెరువులన్నింటినీ నింపుతాం

సింగర చెరువుకు నీటిని నింపే ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - వినుకొండ



పట్టణానికి తాగునీరు సరఫరా చేసే సింగర చెరువును ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శనివారం సందర్శించారు. ఈనెల 8వ తేదీన సాగర్ కాల్వ నుండి నీటిని విడుదల చేయడంతో పెరుమళ్ళపల్లి మేజర్ కాలవ నుండి మునిసిపల్ అధికారులు సింగర చెరువుకు నీరు నింపుతున్నారు. దీనిలో భాగంగా చెరువుకు నీరు నింపే ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించారు. వినుకొండ చెరువుకు పూర్తి స్థాయిలో తాగునీటిని పంపేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, గతంలో తాగునీటిని చేపల చెరువులకు మళ్లించుకొని ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది వారు కాదా? అని ప్రశ్నించారు. అలాంటి పనులు చేసిన వారు ఇప్పుడు నీతివాక్యాలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కూడా సింగర చెరువుకు నీటిని సరఫరా చేస్తుంటే అనేక రకాలుగా అడ్డుపడుతున్నారని, ఎన్ని అడ్డంకులు పెట్టినా ఈ చెరువును పూర్తి స్థాయి నీటి సామర్థ్యంతో నింపుకోగలుగుతున్నామని తెలిపారు. సింగర చెరువుతో పాటు అన్ని మంచినీటి చెరువులను నింపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సొంత పార్టీలోనే నమ్మకం కల్గించలేని నేత

జగన్‌పై జివి ఆంజనేయులు విమర్శ

ప్రజాశక్తి - వినుకొండ

భవిష్యత్‌పై సొంతపార్టీలోనే నమ్మకం కలిగించలేని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని 5 కోట్లమంది ప్రజలు ఎలా విశ్వసిస్తారో చెప్పాలని తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జివి ఆంజనేయులు ప్రశ్నించారు. నమ్మి ఓటేసిన ప్రజలతో పాటు, వెంట నడిచిన వారందర్నీ నిలువునా ముంచబట్టే ఎవరూ వైసిపిలో ఇమడలేక బయటమార్గాల కోసం ఎదురుచూస్తున్నారని ఎద్దేవా చేశారు. శనివారం కూడా టిడిపిలోకి వలసలు కొనసాగాయి. ఎన్నికల ప్రచారంలో ఉన్న జీవీ ఆంజనేయులు సమక్షంలో వినుకొండ ఒకటో వార్డు వెన్నపూస కాలనీకి చెందిన 20 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరాయి. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న చేరికల్లో వారంతట వారే పసుపు కండు వాలు కప్పుకుంటున్నారన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన చిన్నచిన్న హామీలు కూడా నెరవేర్చలేక, వైసిపి తర పున ఓట్లు అడగ డానికి ముఖం చెల్లక చెల్లక క్షేత్రస్థాయి నాయకులంతా టిడిపిలో చేరుతున్నారని అన్నారు.

నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరు

వినుకొండ ఒకటో వార్డులో తన కొడుకు హరీష్ తో కలిసి జీవీ ఆంజనేయులు ప్రచారం నిర్వహించారు. సిఎం జగన్‌ని నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని, అందుకే 'మేమంతా సిద్ధం' అట్టర్‌ఫ్లాప్ అని ఆంజనేయులు ఎద్దేవా చేశారు. వినుకొండ ఒకటో వార్డులోని కల్యాణ్‌పురి కాల నీలో కొడుకుతో, జనసేన రాష్ట్ర నాయకుడు నిశ్శంకర శ్రీనివాసరావు కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. కాలనీలోని అనేక సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.



వినుకొండలో టిడిపిలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్న జివి ఆంజనేయులు

ప్రజాశక్తి-నూజెండ్ల

మండలంలోని అయినవోలులో వైసిపి నుంచి టిడిపిలోకి 20 కుటుంబాలు చేరాయి. పార్టీలో చేరిన వారందరికీ జీవి ఆంజనేయులు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వైసిపి పాలనతో విసిగిపోయి టిడిపిలో చేరిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన సొసైటీ మెంబర్ అప్పిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలోనే వైసిపికి చరమగీతం పాడాలని, దానికి తమ వంతు సహకారం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన పార్టీ నాయకుడు కొంజేటి నాగ శీను (రాయల్), ఉమ్మడి గుంటూరు జిల్లా డిఎల్డిఏ చైర్మన్ లగడపాటి వెంకట్రావు పాల్గొన్నారు



ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఎన్నికల ప్రచారంలో భాగంగా గణపవరంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం ప్రచారం నిర్వహించారు. టిడిపి,జనసేన, బిజెపిల కూటమికి చెందిన ఎమ్మెల్యే అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావును, ఎంపి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు విజయాన్ని ఆకాంక్షిస్తూ ఈ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మిని మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల గురించి అక్కడి మహిళలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వి. హిమవంతరావు పాల్గొన్నారు.

దళితులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - మాచర్ల

రానున్నది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అని, ఎమ్మెల్యేగా జూలకంటి బ్రహ్మారెడ్డి, ఎంపీగా నేను గెలవడం ఖాయమని నరసరావుపేట టిడిపి పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. స్థానిక నరిసెట్టి కళ్యాణ మండపంలో శనివారం మాచర్ల నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వాళ్లిద్దరూ హాజరయ్యారు. శ్రీకృష్ణదేవరాయలు బ్రహ్మారెడ్డిలు మాట్లాడుతూ, దళితులకు అండగా ఉంటామని రాజకీయ



ప్రాతినిధ్యంలో సముచిత స్థానాలను కల్పిస్తామని తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వారిలాగా పేరుకే పదవులు ఇచ్చినట్టు కాకుండా పూర్తి స్వేచ్ఛ స్వతంత్రాలతో వారి పదవులు వారే నిర్వహించుకునేలా చూస్తామని తెలిపారు.

నేటి నుండి అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఏప్రిల్ 14నుండి 20 వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి ఇన్చార్జి అగ్నిమాపక కేంద్రం అధికారి ఎంవి సుబ్బారావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మన్ హుస్సేన్ ,ఫైర్ మన్ మోహన్ బాబు,ఫైర్ మన్.రమణ నాయక్ లు పాల్గొన్నారు.

'పల్నాడులో బలంగా వైసిపి'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి, ఎంపి అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పల్నాడు జిల్లాలో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభకు పల్నాటి ప్రజలు బ్రహ్మరథం పట్టారని, పల్నాడు జిల్లాలో వైసిపి ప్రభంజనం స్పష్టంగా కనిపిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ ల ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండలకు వడగాలులకు లెక్కచేయకుండా రోడ్ షోలకు సభలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారని అన్నారు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలోని బీసీ వర్గీయులు అంతా బ్రహ్మరథం పడుతున్నట్లు చెప్పారు. జిల్లాలో 7 అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంటు స్థానం కచ్చితంగా వైసిపి గెలిచి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు.



వినుకొండలోని 7వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కూతురు మణికుమారి

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కుటుంబీకులు

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణం లోని 7వ వార్డులో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కూతురు మణికుమారి శనివారం ఆ వార్డులో పర్యటించారు. ప్రతి గడపకు వెళుతూ, ప్రతి ఒక్కరినీ అప్యాయంగా పలకరించి, వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి ని ప్రతి ఒక్కరికీ వివరిస్తూ, ప్రజల్లో ముందుకు సాగారు. ఇలాంటి అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ బొల్లా బ్రహ్మనాయుడే ఎమ్మెల్యేగా గెలవాలని, ప్రజలు వారి ఓటును ఫ్యాన్ గుర్తుకే వేయాలని కోరారు.



వైసిపిలోకి చేరికలు

ప్రజాశక్తి-బెల్లంకొండ

బెల్లంకొండ మండలం ఎమ్మాజిగూడెం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు వైసిపిలో చేరారు. చంద్రాజుపాలెంలో జరిగిన కార్యక్రమంలో వీరందరికీ నంబూరు వసంతకుమారి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో సిఎం జగన్, నియోజకవర్గంలో నంబూరు శంకరరావు అన్ని వర్గాలకు మేలు చేశారన్నారు. అందుకే అన్నిపార్టీల నుంచి వైసిపిలోకి చేరికలు పెరిగినట్లు చెప్పారు. ప్రజల్లో స్పందన చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలుపు ఖాయంగా కనిపిస్తోందన్నారు.

రేపు గుంటూరుకు 100 ఈవీఎంలు

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు నగర పాలక సంస్థకు రాష్ట్ర ఎన్నికల సంఘం కేటాయించిన ఈవీఎంల్లో కొన్నింటిని గతేడాది బాపట్ల జిల్లాకు ఇచ్చామని, వాటిని తిరిగి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆ జిల్లా అధికారులు సోమవారం అందించనున్నారని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది మేలో రాష్ట్ర ఎన్నికల సంఘం, గుంటూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుమతితో గుంటూరు నగరపాలక సంస్థకు ఎన్నికల సంఘం కేటాయించిన ఈవీఎంల్లో 100 ఈవీఎంలను స్థానిక సంస్థల ఎన్నికల అవసరాల కోసం బాపట్ల జిల్లాకు ఇచ్చినట్లు తెలిపారు. ఇవి ప్రస్తుతం వారికి అవసరం లేనందున వాటిని తిరిగి గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు ఇవ్వడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం అమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. వీటిని సోమవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఈవీఎంల గోడౌన్‌లో భద్రపరుచుటకు గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

శాంతియుతంగా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి - తుళ్లూరు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను పోలీసుల అనుమతితో శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని స్థానిక సిఐ సుభాని కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బైక్ ర్యాలీలు, సభలు నిర్వహించరాదని చెప్పారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ మేరకు శుక్ర, శనివారం పోలీసులు గ్రామాల్లో మైక్ ప్రచారం చేపట్టారు.

పెదనందిపాడులో నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా పెదనందిపాడు సేవాశక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక సాయిమందిర్ ప్రక్కన ఆదివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తామని ట్రస్ట్ అధ్యక్షులు కొమ్మినేని గోపి తెలిపారు. శిబిరంలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్, గుంటూరు తులసి హాస్పిటల్, స్థానిక ఎస్ఆర్‌కె హాస్పిటల్ సహకారంతో అనుభవజ్ఞులైన వైద్యులు పరీక్షలు చేస్తారని చెప్పారు. గుండె వ్యాధులు చికిత్స, ఆయాసం, గుండె నొప్పి, గుండె బరువుగా ఉండటం, గుండెల్లో దడ, ఎక్కువ కాలంగా బీపీ, షుగర్ ఉన్న వారికి గుండెకు సంబంధించిన జబ్బులకు ఎంతో ఖరీదైన గుండె స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి యాంజియోగ్రామ్ చేస్తారన్నారు. వీటితోపాటు అన్ని రకాల వ్యాధులకు పరీక్షలతోపాటు ఉచితంగా మందులు అందిస్తారన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సకు ఎంపిక చేస్తారని వివరించారు. శిబిరానికి వచ్చేవారికి భోజన సదుపాయం ఉంటుందన్నారు. కాకుమాను, పెదనందిపాడు, ప్రత్తిపాడు, పర్చూరు పండలాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకోసం 8500083222 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు



బిపి మండల్ కమిషన్ సిఫార్సులను పూర్తి స్థాయిలో అమలు చేయాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. బిపి మండల్ 42వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక గోరంట్ల వద్ద మండల్ విగ్రహానికి బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ 76 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో ఇప్పటికీ బిసిలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, బిసిలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని అని, బిసి అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయట్లేదని చెప్పారు. ఇప్పటికైనా బిసిలకు జనాభా ప్రాతిపదికన సమస్త జీవన రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ బిపి మండల్ ఒక కులానికి చెందిన వ్యక్తి కాదని, అతను ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో సామాజిక న్యాయం అందించి, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు కుమ్మరి క్రాంతికుమార్ మాట్లాడుతూ విద్య ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్ల కోసం బిపి మండల్ కృషి చేసి, బిసిల అభివృద్ధికి దోహదం చేశారన్నారు. బిసిల వాటా కోసం మండల్-2 ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.నాగమల్లేశ్వరరావు, నాయకులు కె.హనుమంతరావు, కె.వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విజె విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - మంగళగిరి



మోహన్ సాయి బాలాజీ, గౌమిక

ఇంటర్ ఫలితాలలో స్థానిక విజె కళాశాల విద్యార్థులు అద్భుత విజయాలు సాధించారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ప్రెగడ రాజశేఖర్ చెప్పారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో జి.మోహన్ సాయి బాలాజీ 985/1000 మార్కులతో ప్రథమ స్థానాన్ని, జి.గౌమిక 982/1000 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, బైపీసీలో షేక్ ఉస్మా హమీద 971 మార్కులతో ప్రథమ స్థానాన్ని, వి.సుదర్శన్ 924 ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు తెలిపారు. ఎంఇసిలో ఎ.జశ్విత 978/1000 మార్కులతో ప్రథమ స్థానాన్ని, సిహెచ్ మీనాక్షి 690/1000 మార్కులతో ద్వితీయ స్థానాన్ని సాధించర న్నారు. సీఈసీలో పి.నేహశ్రీ 902/1000 మార్కులతో ప్రథమ స్థానాన్ని, ఎం. శివచైతన్య 872/1000 మార్కులతో ద్వితీయ స్థానాన్ని పొందారన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో హెచ్.శ్రీలక్ష్మి పార్థసారథి 457/470 మార్కులతో ప్రథమ స్థానాన్ని, జె.నాగవెంకట అమృత, పి.తులసి సాయిగోపిక 456/470 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, బైపీసీలో డి.ఎలిజిబెత్‌రాణి 412/440 మార్కులతో ప్రథమ స్థానాన్ని, వి.వెంకట సాయిలోకేష్ 409/440 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, ఎంఇసిలో కె.కీర్తి నాగసాయి 460/500 మార్కులతో ప్రథమ స్థానాన్ని, టి.శ్రీకర్ ఆనంద్ 450/500 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, సీఈసీలో బి.ప్రవల్లిక 473/500 మార్కులతో ప్రథమ స్థానాన్ని, డి.ఆశ్రిత 413/500 మార్కులతో ద్వితీయ స్థానాన్ని,హెచ్ఇసిలో జి.రమ్య 477/500 మార్కులతో ప్రథమ స్థానాన్ని పొందారని రాజశేఖర్ వివరించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, అందుకు సహకరించిన అధ్యాపకులకు కరస్పాండెంట్‌తోపాటు ప్రిన్సిపల్ అవ్వారి సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ జి.లక్ష్మి అభినందనలు తెలిపారు.

'పవన్, చంద్రబాబులపై ముద్రగడ ఆరోపణలను సహించం'

ప్రజాశక్తి - మంగళగిరి



పవన్‌కల్యాణ్, చంద్రబాబులపై అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పూరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముద్రగడ పద్మనాభం కాపు నాయకుడు కాదని బాడుగ నేతని ధ్వజమెత్తారు. 40 ఏళ్ళుగా కేవలం ఎమ్మెల్యే, ఎంపీ పదవుల కోసం కాపు జాతిని తాకట్టు పెట్టారని, గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఏజెంట్‌గా వ్యవహరించిన ముద్రగడ నేడు జగన్మోహన్‌రెడ్డి కోసం తహతహలాడుతున్నారని విమర్శించారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్‌ను ఓడించడం కోసం 100 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఖర్చు పెట్టేంత డబ్బును ఖర్చు పెడుతున్నారని ఆరోపించారు. కాపులను అప్రదిష్ట పాల్జేసే చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విన్నకోట శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాపు సామాజిక వర్గానికి ఏదైనా మేలు జరిగిందంటే అది టిడిపి హాయాంలోనేనని అన్నారు. సమావేశంలో సమావేశంలో కాపుదళం మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు రంగిశెట్టి నరేంద్ర (బాబి), సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవాడ దుర్గారావు, రాష్ట్ర కార్యదర్శి తిరుమలశెట్టి మురళీకష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాణాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపిలో కష్టపడి నష్టపోయాం.. : హెనీ క్రిస్టీనా

ప్రజాశక్తి - తెనాలి



మాట్లాడుతున్న క్రిస్టీనా, వేదికపై మనోహర్, రాజకుమారి

వైసిపిని నమ్ముకుని 12 ఏళ్లుగా ఎంతో నష్టపోయామని, పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానన్న జగన్ అన్ని విధాల నష్టపరిచారని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ హోటల్లో శనివారం జరిగిన టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో క్రిస్టీనా మాట్లాడుతూ తన భర్త కత్తెర సురేష్ కుమార్‌ను వైసిపి తాడికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించిన జగన్ దాదాపు రెండేళ్ల పాటు శ్రమించిన తదుపరి తమను కాదని మరొకరికి సీటును కేటాయించారన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో అవకాశం కల్పిస్తానని మాట ఇచ్చిన జగన్ దానిని నిలుపుకోలేదని చెప్పారు. దళితులకు వైసిపిలో గౌరవం లేదని, అంతా పెత్తందారీ వ్యవస్థ నడుస్తోందని, టిడిపి పై నమ్మకంతో తాము పార్టీలో చేరామని చెప్పారు. మనోహర్ మాట్లాడుతూ తెనాలి అభివృద్ధి పథంలో నడిపించేందుకు తనను గెలిపించాలని, తనతోపాటు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు వై.రఘునాథబాబు, మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ ఎన్.రాజకుమారి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జి.ఉమ, హార్వెస్ట్ ఇండియా అధినేత డాక్టర్ కె.సురేష్ కుమార్, పి.రవిశంకర్, డాక్టర్ మనోహరం, ఎ.జయలక్ష్మి, ఎన్.సుధాకర్, ఎస్.రామారావు, హరిప్రసాద్, వి.సాంబిరెడ్డి, ఎస్.నాగరాజు, పి.సురేష్ బాబు, హెచ్.గౌరీశంకర్ పాల్గొన్నారు.



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు

ఇంటర్ ఫలితాల్లో శ్రీవిష్ణు జూనియర్ కాలేజీ విద్యార్థుల అద్భుత ఫలితాలు

ప్రజాశక్తి - మంగళగిరి

ఇంటర్ ఫలితాలలో శ్రీవిష్ణు జూనియర్ కాలేజీ ప్రభంజనం సృష్టించిందని, కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా ఫలితాలు సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ టి.మనోజ్ కుమార్, డైరెక్టర్ వివి ప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, డైరెక్టర్ వివి శ్రీకాంత్ అన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో టి.వివేక్ 967 మార్కులు, డి.తేజశ్రీ 971 మార్కులు, బైపీసీలో టి.రమ్య 966 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో అవేశ 460 మార్కులు, బైపీసీలో ఇ.మాధురి 430 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను వారికి సహకరించిన అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు.



ఎస్ఎం సుభానీకి సత్కారం

ప్రజాశక్తి - గుంటూరు

సాహితీ కిరణం మాస పత్రిక (హైదరాబాద్)ఆధ్వర్యంలో శనివారం ఉదయం గుంటూరు రూరల్ మండలం పొత్తూరులో జరిగిన సాహితీ సభలో పాల్గొని కవితా గానం చేసిన రచయితల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.సుభాని సత్కారం పొందారు. సుభానిని సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, నేటినిజం సంపాదకులు బైసా దేవదాసు, పట్టాభి కళాపీఠం అధ్యక్షులు తూములూరి రాజేంద్రప్రసాద్, ప్రముఖ నాటక రచయిత విడుదల సాంబశివరావు, ప్రముఖ కథా రచయిత వడలి రాధాకృష్ణ, పెద్దూరి వెంకటదాస్, తంగిరాల చక్రవర్తి సత్కారించారు. సభలో కె.వి.ఎల్.ఎన్. ప్రసన్నకుమారి పుస్తకం సాహితీ సకలం, బైసా దేవదాసు రాసిన ఆలోచనల ఆవిష్కరణ పుస్తకం ఆవిష్కరణ జరిగింది. కథా, కవితల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశ్యారు. కార్యక్రమంలో జమదగ్ని, షేక్ కాశింబి, తాటికొల పద్మావతి, బుర్రి కుమార్‌రాజు, సయ్యద్ జానీబాషా పాల్గొన్నారు.

వైసిపిని వీడి కాంగ్రెస్ లోకి

ప్రజాశక్తి - తాడికొండ



నియోజకవర్గ కేంద్రమైన తాడికొండకు చెందిన షేక్ సలీం, ఇతర నాయకులు శనివారం వైసిపిని వీడి ఇండియా బ్లాక్ అసెంబ్లీ అభ్యర్థి చిలకా విజయ్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మైనార్టీలకు న్యాయం చేస్తుందన్నారు. చిలకా విజయ్ కుమార్ విజయానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ లియాకత్ అలీ, గ్రామ అధ్యక్షులు షేక్ రహంతుల్లా, ఎ.శ్రీనివాస్, ఎస్.కోటేశ్వరరావు జె.సుబ్బారావు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ సత్తా

ప్రజాశక్తి-గుంటూరు



ఇంటర్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు మరోసారి సత్తాచాటారని సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. జూనియర్ ఎంఇసిలో 500 మార్కులకుగాను జి.గిరీష్ 492 మార్కులు సాధించాడన్నారు. 491 ఆపైన మార్కులు నలుగురు, 490 ఆపైన 15 మంది, 480 ఆపైన మార్కులు 176 మంది 450 ఆపైన మార్కులు 531 మంది ఉన్నట్లు తెలిపారు. సీనియర్ ఎంఇసిలో హర్షతేజ 1000 మార్కులకుగాను 983 మార్కులు సాధించినట్లు తెలిపారు. 981 ఆపైన 5గురు, 970 ఆపైన 63 మంది, 950 ఆపైన మార్కులు సాధించిన వారు 205 మంది ఉన్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మట్టుపల్లి మోహన్ అభినందనలు తెలిపారు.

చలపతిలో ఘనంగా హ్యాక్‌ఫెస్ట్

ప్రజాశక్తి-గుంటూరు


ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులతో అతిథులు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజీలో పిఎస్‌జి టెక్నాలజీ, శాప్ సంయుక్తంగా ఐటెక్ హ్యాక్‌ఫెస్ట్-2024 రీజనల్ రౌండ్ పోటీలు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్.వెంకటరామన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయటానికి వేదికగా ఇలాంటి సాంకేతిక ఫెస్ట్‌లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు రియల్ వరల్డ్ సమస్యలకు ఇన్నోవేటివ్ ఐడియాలను గుర్తించి, వాటిని ప్రదర్శించటానికి ఇలాంటి జాతీయ స్థాయి హ్యాక్‌ఫెస్ట్‌లను శాప్ సంస్థ నిర్వహిస్తోందన్నారు. తద్వారా సాంకేతిక విద్యామండలి ప్రస్తుతం ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను అధిగమించటానికి సాంకేతికత మరింత అభివృద్ధి చెందాలన్నారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని, బహుళజాతి సంస్థల్లో ఉద్యోగావకాశాలు సాధించటానికి ఇలాంటి జాతీయ హ్యాకథాన్‌లు ఉపయోగపడతాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ హ్యాక్‌ఫెస్ట్‌కు తమ కళాశాలతోపాటు, రాష్ట్రంలోని 30 కళాశాలలకు చెందిన 75 బృందాలు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎ.బాలాజీ, డాక్టర్ కె.వి.రామారావు, డాక్టర్ వై.రాకేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఫెస్ట్‌లో పలు సాంకేతిక అంశాలైన గ్రీన్ క్రెడిట్ మేనేజ్‌మెంట్, క్రౌడ్ సోర్స్‌డ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు కృత్రిమమేధను ఉపయోగించే సత్ఫలితాలు సాధించటం తదితర ఐడియాలను విద్యార్థులు సేకరించారని తెలిపారు.

ప్రభుత్వ విద్యతోనే అసమానతలు దూరం

యుటిఎఫ్ స్వర్ణోత్సవం సందర్భంగా విద్యా సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రభుత్వ ఆధ్వర్యంలో విద్య కొనసాగితేనే సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగిపోతాయని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. రాజ్యాంగ లక్ష్యాలైన అసమానతలు తొలగించటానికి ఉపాధ్యాయులు విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో విద్యా సదస్సు నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఈ సదస్సులో పాల్గొన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రముఖ ఆర్థికవేత్త, స్వతంత్ర జర్నలిస్టు డి.పాపారావు ఆర్థిక, రాజకీయ కేంద్రీకరణలు-పర్యవసానాలు అనే అశంపై ప్రసంగించారు. 'ఆర్థిక సంస్కరణలు- విద్యా రంగంపై ప్రభావం' అనే అంశంపై ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 45 ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్య అందించాలని, ఆదేశిక సూత్రాలలో ప్రభుత్వ రంగంలోనే విద్య ఉండాలని స్పష్టంగా ఉందన్నారు. కానీ 1991 తర్వాత సంస్కరణల ఫలితంగా విద్యరంగా ప్రైవేటు, కార్పొరేట్ పరం అయ్యి పేదలకు విద్య దూరం అవుతుందన్నారు. ప్రస్తుతం విద్యా రంగంలో పేద, ధనిక తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని విశ్లేషించారు. ప్రభుత్వ బడులలో పేదలు మాత్రమే చదువుతున్నారని చెప్పారు. సంస్కరణలను పారిశ్రామిక రంగానికే పరిమితం చేస్తామన్న పాలకులు అన్ని రంగాల్లో అమలు చేశారని, విద్య, వైద్య రంగాలపై తీవ్ర ప్రభావం చూపాయని అన్నారు. దేశంలో సుమారు 950 యూనివర్సిటీలు ఉంటే వాటిలో 500 ప్రైవేటు యాజమాన్యంలో ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పరిరక్షణకు ఉపాధ్యాయులు సామాజిక బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుటిఎఫ్ స్థాపించి 50 ఏళ్లవుతున్న సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వివిధ అంశాలపై సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాలకులు ఎవరైనా విధానాల ప్రాతిపదికగా, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాసరావు, కె.సురేష్‌కుమార్, ఎఎన్. కుసుమ కుమారి, ఎస్ఎస్ నాయుడు, జి.వి.రమణ, టిఎస్ఎన్ఎల్ మల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్, బాపట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వినయ్‌కుమార్, ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అచీవర్‌గా సుశాంత్

ప్రజాశక్తి-గుంటూరు

హిందూ కళాశాల విద్యార్థి సుశాంత్ బొండలపాటిని ఇండియన్ బుక్స్ ఆఫ్ రికార్డ్స్ (ఐబిఆర్) అచీవర్‌గా గుర్తించింది. హిందూ కళాశాలలో బికాం 3వ సంవత్సరం చదువుతున్న సుశాంత్ తన సేవలు, విద్యా ప్రమాణాలు గుర్తించి అతనికి ఈ ప్రత్యేక గౌరవం లభించింది. గుంటూరులో జన్మించిన సుశాంత్ తన విద్యా ప్రతిభ, సేవా స్ఫూర్తితో ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు. ఈ సందర్భంగా సుశాంత్ ప్రధాన మార్గదర్శకులు పి.ఎం.ప్రసాద్, కే.వి.ఎస్. దుర్గాప్రసాద్‌తో పాటు, హిందూ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సుశాంత్‌ను సత్కరించి, అభినందించారు.



ఎన్నికల సంగ్రామం.. పోటాపోటీగా ప్రచారం..

వీక్షణం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతోంది. పోలింగ్‌కు ఇంకా నెల సమయం ఉన్నా ఎన్నికల షెడ్యూలు వెలువడిన వెంటనే ప్రధాన పార్టీలన్నీ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్ గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 'మేమంతా సిద్ధం' పేరుతో ఎన్నికల ప్రచార బస్సుయాత్ర నిర్వహించారు. రెండ్రోజుల విరామం మధ్య దాదాపు వారం పాటు ఆయన పర్యటన కొనసాగింది. వినుకొండ, నర్సరావుపేట, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, తాడికొండ, ప్రత్తిపాడు, గుంటూరు తూర్పు, పశ్చిమ, మంగళగిరి నియోజకవర్గాల్లో ఆయన పర్యటన జరిగింది. బస్సు యాత్రకు భారీగానే జనసమీకరణ జరిగింది. జిల్లాలో పలువురు టిడిపి, బిజెపి నాయకులను వైసిపిలో చేర్పించడంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు సఫలీకృతం అయ్యారు. జగన్ బస్సు యాత్రతో ఆపార్టీ అభ్యర్థుల్లో ఉత్సహం కన్పిస్తోంది.

మరోవైపు టిడిపి తరుపున ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఇప్పటికే దాదాపుగా సగం నియోజకవర్గాల్లో ప్రజాగళం సభలను నిర్వహించారు. తొలి విడత ఎన్నికల ప్రచారాన్ని ముగించారు. గురజాల, పెదకూరపాడు, సత్తెనపల్లి, తెనాలి, వేమూరు, రేపల్లె, బాపట్ల, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో ఆయన నిర్వహించిన సభలకు ప్రజా స్పందన బాగుందని ఆ పార్టీ అభ్యర్థులు గెలుపుపై ధీమాతో ఉన్నారు. గత నెల 17న చిలకలూరిపేటలో నిర్వహించిన ఎన్‌డిఎ కూటమి సభ కూడా వైసిపి ప్రభుత్వంపై ప్రధాని మోడీ పెద్దగా విమర్శలు చేయకపోవడంతో వైసిపి నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. చంద్రబాబు సభలకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. సిఎం జగన్ సభలకు పెద్ద ఎత్తున బస్సులు ఏర్పాటు చేసి ప్రజలను తరలిస్తున్నారనే విమర్శలున్నాయి.

టిటిడి, వైసిపి నుంచి లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు దాదాపుగా ఖరారు కావడంతో వారంతా ఇంటింటి ప్రచారంపై దృష్టి సారించారు. ఉదయం పూట ఆత్మీయ సమావేశాలు,సాయంత్రం ఇంటింటి ప్రచారానికి అభ్యర్థులు ప్రాధాన్యత ఇస్తున్నారు. గుంటూరు లోక్‌సభ టిడిపి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రచారంలో ముందజలో ఉన్నారు. వైసిపి అభ్యర్థి కిలారి రోశయ్య ప్రచారంలో కొంత వెనుకబడ్డారు. ఆయన అభ్యర్థిత్వాన్ని మారుస్తారన్న ప్రచారం ఆయనకు శిరోభారంగా మారింది. టిడిపికి ఇది సానుకూల అంశంగా ఉంది. ఇప్పటికి వైసిపి నుంచి లోక్‌సభకు పోటీ చేసేందుకు ఇప్పటికే ముగ్గురుని ఎంపిక చేశారు. తీరా రోశయ్య పోటీపై నీలినీడలు అంటూ వార్తలు రావడంతో అధికార పార్టీలో అయోమయం రాజ్యమేలుతోంది. గుంటూరు పశ్చిమలో వైసిపి అభ్యర్థి మంత్రి విడదల రజని ప్రచారంలో ముందజలో ఉన్నారు. నాలుగు నెలల నుంచి ఆమె ప్రచారం నిర్వహిస్తూ వినూత్నంగా ప్రజలను ఆకట్టుకోవడానికి నేరుగా ఇంటింటి ప్రచారంపై దృష్టి సారించారు. మంగళగిరిలో టిడిపి, వైసిపి, ఇండియా వేదిక అభ్యర్థులు నారా లోకేష్, మురుగుడు లావణ్య, జొన్నా శివశంకరరావు పోటా పోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

నర్సరావుపేట లోక్‌సభ పరిధిలో వైసిపి, టిడిపి అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఒక్కొక్కరు ఒక్కో పంథాలో ప్రచారంలో ఉన్నారు. మంత్రి అంబటి రాంబాబు రోజుకో వినూత్న రీతిలో డాన్సులు, కళా సాంస్కృతిక అంశాలతో ప్రచారం చేస్తున్నారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరిని కలిసి క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. లోక్‌సభకు పోటీ చేస్తున్న లావు శ్రీకృష్ణదేవరాయులు, పి.అనిల్‌కుమార్ ఇప్పటికే తొలి విడత ప్రచారాన్ని ముగించారు. శ్రీకృష్ణదేవరాయులు సిట్టింగ్ ఎంపి కావడంతో ఆయన అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో వేగంగా దూసుకుపోతున్నారు. కాంగ్రెస్, వామపక్షాలు, ఆమ్‌ఆద్మీ పార్టీ కలిసి ఏర్పాటు చేసిన ఇండియా వేదిక ప్రచార సభ శుక్రవారం గుంటూరులో జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి తదితరులు ఈ సభలో పాల్గొని వేదిక ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు.

(ఎ.వి.డి.శర్మ)



స్ట్రాంగ్ రూం నుండి ఈవీఎంల తరలింపు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట వినుకొండ రోడ్డులోగల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని గోదాముల్లో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ల (ఈవీఎం)లను తొలివిడత ర్యాండమైజేషన్ ప్రక్రియ అనంతరం నియోజకవర్గాల వారీగా తరలించే ప్రక్రియను శనివారం చేపట్టారు. తరలింపును జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు రాండమైజేషన్ ప్రక్రియకు సంబంధించిన పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, శ్రీరాములు పాల్గొన్నారు.

